పరికించి బుచ్చిరామయ్యగారికేసి చూసి తల పంకించారురా. అప్పటికింకా బుచ్చిరామయ్యగారికి వివాహం కాలేదురా. అయినా ఆంతర్యాన్ని అర్థం చేసుకోలేని అమాయకులేమీ కాదు. అందుకే చేతులు శిరసుమీద జోడించి పితృదేవునికి ప్రణమిల్లారు. తమ చిరంజీవిని ఆశీర్వదించి లేవనెత్తి రంగసాని అందించిన తాంబూలాన్ని అందుకున్నారురా బుచ్చి వెంకయ్యగారు. సభ యావత్తూ "సాహో" అందిరా. పాదాభివందనం చేసి, ఆశీస్సునందుకుని మేనా ఎక్కిందిరా రంగసాని.

ఆ విధంగా తండ్రి అనుమతితో వేదఘోషల మధ్య అరుంధతిని వశిష్ఠులవారు చేపట్టినట్టు ఒక శుభ ముహూర్తాన కాంచనలతని చేపట్టారురా బుచ్చి రామయ్యగారు. ఆ తరువాత రంగసాని గుమ్మం ఎక్కే సాహసం ఏ నరుడూ వెయ్యలేదురా. అగ్నిశిఖలాంటి బుచ్చిరామయ్యగారు.

కన్నా, అలా ఆనందంగా రోజులు గడిచిపోతున్నాయిరా. చివరికి బుచ్చిరామయ్యగారు తుది ప్రయాణానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. వారి చూపులు వీథి గుమ్మం దగ్గర తారట్లాడుతూనే వున్నాయి. ఆ చూపుల భావాన్ని గ్రహించిన తనయులు తల్లిని చాటుకి పిలిచి,

"అమ్మా, పెద్దమ్మకి కబురు చేయాలేమో" అని అనడమూ జరిగింది. ఏం చెయ్యాలో తెలియని స్థితిలో వారి దగ్గరికి వెంకమ్మగారు రావడమూ, ఆమె ఆంతర్యాన్ని గ్రహించి నిండుగా నవ్వి వద్దన్నట్లు తల పంకించడమూ జరిగింది. సరిగ్గా అప్పుడే కాంచనలత అడుగుపెట్టడమూ, వారి కుడిపాదం మీద తల ఆనించి కూర్చోవడమూ జరిగిందిరా తండ్రీ.



బుచ్చిరామయ్యగారి స్పర్శతో పునీత అయిన కాంచనలత మేరువులా శోభించిందిరా. అపర శర్వాణే అయిందిరా. ఆ తల్లిని కన్నెత్తి చూడగలిగే ధిలాసా ఎవరికుంటుందిరా కన్నా.

బుచ్చిరామయ్యగారికి ముందు వీథి గుమ్మం చూడ లేదురా ఆ మెరుపు తీగ. వారిచేత పాణిగ్రహణం చేయబడ్డాక ఆ అవసరమూ కనిపించలేదురా ఆ తల్లికి.

ఆ తరువాత, సాంప్రదాయకంగా గృహస్థాశ్రమాన్ని స్వీకరించారురా బుచ్చిరామయ్యగారు. అనాదిగా వస్తున్న వేదఘోష ఆ గృహాన్ని వదలలేదురా. శిష్యకోటి వేద విద్యని అందుకుంటూనే వుంది. రంగసాని నుంచి వార్షికంగా కట్నం అందుతూనే వుంది. ఆ యిల్లాలి తదనంతరమూ కొనసాగుతూనే వచ్చింది. బుచ్చి రామయ్యగారి ఆంతర్యాన్ని తెలుసుకుని, వారికి ఏ అలసటా కలగకుండా, వారి గృహిణి వెంకమ్మగారూ మసులుకుంటూనే వుంది. నాలుగు వేదాల్లా పుట్టుకొచ్చిన నలుగురు కొడుకులూ ఆ తండ్రికి తగ్గ తనయులుగా గుర్తింపుని పొందారు. కాంచనలత గృహాన్ని సందర్భం తారసపడినప్పుడు పావనంచేస్తూనూ వున్నారు

ప్రకృతి పురుషుల మధ్య కబుర్లతో అవసరమేముందిరా కన్నా. వసంతకాలంలో కోకిల కూయడం ఎంత సహజమో, ప్రకృతి పురుషుడిలో ఒదిగిపోవడమూ అంతే సహజంరా. అందుకే మనసు పంపిన సందేశాన్నందుకుని అఖండ గౌతమిని దాటి అరనిమిషం కూడా అడుగుల్ని ఆపకుండా అలసటన్నది తెలియకుండా, గుక్కపట్టిన బోయీల "భోం" కారం "ఓం" కారం కాగా, తొంభై ఘడియల దూరాన్ని తొమ్మిది క్షణాలన్నంత వేగంగా పూర్తిచేసి బుచ్చిరామయ్యగారి పాదాల దగ్గర వాలిందిరా కాంచనలత.

ఎడమ అరిపాదాన్ని నిమురుతున్న వెంకమ్మగారి చేతిని ఆ పాదం చల్లగా మంచు గడ్డలా తాకిందిరా. బిత్తరపోయిన వెంకమ్మగారు, గొంతుక దుఃఖంతో పూడుకుపోతుంటే, "అప్పా" అని కాంచనలతని వాటేసుకుందిరా. వన్నె తరగని ఆమె శరీరం, ముఖం మీద నిండు కుంకుమ బొట్టుతో అగ్నిశిఖలా వెలిగిపోతూ వుంటే, వెంకమ్మగారి చేతుల్లోంచి చల్లగా కిందికి జారిపోయిందిరా ఆ తటిల్లత.

అంతేరా కన్నా, అంతే!

# కాలమ్ దాటని కథ



"ఒరేయ్ పండూ! టి.వి.లో చిన్న బాబొచ్చాడు చూడు" నా మూడేళ్ళ మనవడిని పిలిచాను. వచ్చి చూశాడు.

"బాబెందుకు గుండు చేసుకున్నాడు?" వాడి ముద్దు మాటలతో అడిగాడు.

"వాళ్ళ నాన్న సెలూన్ దగ్గరికి తీసుకెళ్ళి గుండు చేయించేశాడమ్మా!" పండుగాడి నాన్న మొన్నోసారి వాడికి సమ్మర్ క్రాఫ్ చేయించేస్తే అందరం పెట్టిన చివాట్లు గుర్తొచ్చి అలా అన్నాను.

"ఎందుకు గుండు చేయించేశాడు?"

"బుద్ధి లేక."

"బుద్ధి ఎందుకు లేదు?"

"గడ్డి తిని."

"గడ్డి ఎందుకు తిన్నాడు?"

# ఎందుకు?

"ఆవు తినలేదు. అందుకని తిన్నాడు."

"ఆవెందుకు తినలేదు?"

"పాలికాపు విప్పలేదట."

"ఎందుకు విప్పలేదు?"

"వాళ్ళబ్బాయి ఏడ్చాడట."

"ఎందుకు ఏడ్చాడు?"

"చీమ కుట్టిందట."

"చీమెందుకు కుట్టింది?"

"పుట్టలో వేలుపెడ్తే కుట్టింది."

"పుట్టలో ఎందుకు వేలు పెట్టాడు?"

"ఏమోరా బాబూ! నాకు తెలియదు. కథ అంత వరకే వుంది."

"చెప్పు తాతయ్యా! పుట్టలో ఎందుకు వేలు పెట్టాడు?"

తలమీద కొట్టుకుంటూ "బుద్ధిలేక పెట్టాడ్రా బాబు. బుద్ధిలేక పెట్టాడు వేలు."

"ఎందుకు బుద్ధిలేదు?"

అయ్యబాబోయ్ కథ మళ్ళీ మొదటికొచ్చింది.

"ఏమేవ్! పండుగాడికి ఓ చాక్లెట్ యివ్వవే!"

కేక పెట్టాను. తుర్రుమన్నాడు వాడు లోపలికి.

"యక్ష ప్రశ్నలకైనా జవాబు చెప్పవచ్చేమోకానీ వీడి ప్రశ్నలకి మాత్రం సమాధానం చెప్పలేంరా బాబు" అనుకుని నిట్టూర్చాను.

— శారదారాజ్